క్లుప్తంగా

ఘనంగా షాబాజ్ దీవాన్ వలి ఉరుసు


స్వామి షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని కల్‌హోళలో హజరత్ సయ్యద్ షాబాజ్ దీవాన్ వలి ఉరుసు ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. గురువులు హజరత్ సయ్యద్ సజ్జద నషీన్ యుసఫ్, హజరత్ సయ్యద్ మెహమ్మద్ సాబ్‌ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు స్వామి షంషీర్‌ను ఊరేగింపు చేపట్టారు. భక్తులు స్వామికి చాదర్‌లు, నూతన వస్త్రాలు, పూలహారాలు అందజేసి మొక్కులను తీర్చుకున్నారు. అనేక మంది భక్తులు పిల్లలకు చక్కెర తులాభారం వేయించారు. పోలీసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. దర్గా నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం


జల్లిపల్లిలో విత్తన పంపిణీ ప్రారంభిస్తున్న దృశ్యం

కూడేరు: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి దేవేంద్ర, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బైరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జల్లిపల్లిలో ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తున్న విత్తన వేరుశనగ పంపిణీని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఓ విజయ కుమార్, ఎంపీఈఓ జయప్రకాష్, వైఎస్సార్ సీపీ నేతలు సిద్దారెడ్డి, రమేష్ నాయక్, వెంకటేష్, హనుమంతు, మల్లప్ప, రాంభూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఎంపీడీఓగా సాలమాన్



కళ్యాణదుర్గం రూరల్: ఎంపీడీఓగా సాలమాన్ పదవీ బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నూతన ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. నంద్యాల జిల్లా సిరిసిల్లలో పీఆర్ ఈఓఆర్డీగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై కళ్యాణదుర్గానికి బదిలీ వచ్చి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఎంపీపీ మారుతమ్మ, మండల సచివాలయాల కన్వీనర్ భట్టువానిపల్లి ఆంజనేయులు, ఏఓ శంకర్ తదితరులు ఎంపీడీఓను కలసి మండలాభివృద్ధిపై చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, సర్పంచు చంద్రానాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

ఎంపీడీఓగా నరసింహామూర్తి



గుమ్మఘట్ట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నరసింహామూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మడకశిర నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. మండల కార్యాలయ సిబ్బంది, ఎంపీపీ భవాని, ఎంపీటీసీలు , వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్ రఘు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నరేశ్‌కుమార్ యల్లనూరుకు బదిలీ అయ్యారు. అలాగే తాళ్లకెరకు వీఆర్వోగా ముకుంద, కలుగోడు వీఆర్వోగా మాంతేష్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

ఎంపీడీఓగా రామచంద్ర

బెళుగుప్ప: ఎంపీడీఓగా జీఎస్ రామచంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ యాదవేంద్ర బదిలీ కావడంతో ధర్మవరంలో పరిపాలన అధికారిగా వున్న రామచంద్ర పదోన్నతిపై బెళుగుప్ప ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంపీడీఓపే కార్యాలయ అధికారులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.

ఏఓ బాధ్యతల స్వీకరణ

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా వాణిశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమెను అధికారులు ఏఓగా పదోన్నతి కల్పిస్తూ కళ్యాణదుర్గానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన ఏఓను సాదరంగా ఆహ్వానించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాల అమలుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

సర్వేయర్‌గా మణికంఠ

కంబదూరు: మండల సర్వేయర్‌గా మణికంఠ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ మండల సర్వేయర్‌గా పని చేస్తున్న మున్వర్ బదిలీపై కుందుర్పి మండలానికి వెళ్లడంతో.. కణేకల్లులో పని చేస్తున్న మణికంఠ ఇక్కడికి బదిలీపై వచ్చారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనను సచివాలయ సర్వేయర్లు సన్మానించారు.

నాలుగేళ్లలో దుర్గానికి నిధుల వరద..!


కళ్యాణదుర్గంలో రూ.3.50 కోట్లతో నిర్మించిన50 పడకల ఆస్పత్రి భవనం


కంబదూరు బైపాస్ నుంచి టీ సర్కిల్ వరకు రూ.9 కోట్ల వ్యయంతో జరుగుతున్న డబుల్ రోడ్డు పనులు



కళ్యాణదుర్గం మండలం కొత్తూరులో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే భవనాలు

- ఏ నోట విన్నా...జగనన్న పథకాల మాటే..
- ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల లబ్ధి

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో ఏ మారుమూల పల్లెకు వెళ్లి..ఏ గడప తలుపు తట్టినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల మాటే వినిపిస్తుంది. ఏ ఒక్కరిని కదిలించినా మా ఇంటికి అమ్మ ఒడి వచ్చిందిది.. పింఛను వస్తుంది... వైఎస్సార్ రైతు భరోసా....వసతి దీవెన వస్తుందంటూ సంతోషంగా సమాధానమిస్తున్నారు. ఇదంతా కేవలం వైఎస్సార్‌సీపీ అందిస్తున్న ప్రజారంజక పాలన మహిమేనని స్పష్టమవుతోంది.

పేదల సంక్షేమంపై దృష్టి

2019లో అధికారంలోకి రాగానే పేదల సంక్షేమంపై వైఎస్సార్‌సీపీ దృష్టి సారించింది. కనీవినీ ఎరుగని రీతిలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలకు నిధుల వరదను పారించింది. సంక్షేమ పథకాల ద్వారా 2019 జూన్ నుంచి 2023 మే వరకూ కళ్యాణదుర్గంలో సంక్షేమ పథకాల అమలు ద్వారా ఏకంగా 8,87,989 మంది లబ్ధిదారులకు రూ.3051.84 కోట్లు విడుదలైంది. అలాగే వివిధ పథకాల ద్వారా 55,973 అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.1209.37 కోట్లు ఖర్చు చేసింది. ఈ మొత్తం ఎలాంటి దళారీల వ్యవస్థ లేకుండా నేరుగా డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాకే జమయ్యేలా చర్యలు చేపట్టింది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రతి గడపకూ సంక్షేమ పథకాన్ని అందించింది.

మరింత అభివృద్ధి చేస్తా..



నియోజకవర్గ ప్రజలు ఎంత నమ్మకంతో నన్ను ఆదరించారో అంతే నమ్మకంగా ఏడాది లోపు మరింత అభివృద్ధి చేస్తా. నాలుగేళ్లలో రూ.నాలుగు వేల కోట్లు సంక్షేమం, అభివృద్ధికి ఖర్చు చేశామంటే అతిశయోక్తి కాదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రాబోవు రోజుల్లో బీటీపీ ప్రాజెక్టును పూర్తి చేసి నియోజకవర్గంలోని 114 చెరువులకు నీరందిస్తాం. కళ్యాణదుర్గం పట్టణంలో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకున్నాం. ప్రతి గడపకూ అందుతున్న సంక్షేమాన్ని ఓర్వలేకే ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి.

– కేవీ ఉషశ్రీచరణ్,
రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి

2019 నుంచి 2023 మే వరకూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సంక్షేమ పథకాల లబ్ధి ఇలా...

- వ్యవసాయ శాఖ ద్వారా 3,22,571 మంది లబ్ధిదారులకు రూ.478.51 కోట్లు జమ
- పశు సంవర్ధక శాఖ ద్వారా 3,256 మంది పాడి రైతులకు రూ.3.27 కోట్లు లబ్ధి
- ఏపీ ఎంఐపీ డ్రిప్ ఇరిగేషన్ ద్వారా 3,623 మందికి రూ.6.57 కోట్లు జమ
- విద్యుత్ శాఖ ద్వారా 25,216 మందికి రూ.416.67 కోట్లు లబ్ధి
- బీసీ వెల్ఫేర్ ద్వారా 2,922 మందికి రూ.8.23 కోట్లు జమ
- సివిల్ సప్లయి ద్వారా 55 మందికి రూ.2.88 కోట్లు లబ్ధి
- డిజేబుల్ వెల్ఫేర్ ద్వారా 161 మందికి రూ.0.91 కోట్లు జమ
- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ట్రస్టు ద్వారా 24,754 మందికి రూ.44.86 కోట్లు లబ్ధి
- డీఆర్‌డీఏ వైకేపీ పథకం ద్వారా రూ.80,109 మందికి రూ.1207.48 కోట్లు జమ
- ఉపాధి హామీ పథకం ద్వారా 69,987 మందికి రూ.184.99 కోట్లు లబ్ధి
- విద్య కోసం వివిధ పథకాల ద్వారా 1,13,327 మందికి రూ.132 కోట్లు జమ
- ఎండోమెంట్ పథకం కింద 824 మందికి రూ.0.41 కోట్లు లబ్ధి
- హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ ద్వారా 642 మందికి రూ.3.51 కోట్లు జమ
- హార్టికల్చర్ ద్వారా ఎంఐడీహెచ్, ఆర్‌కేవైవై పథకాల ద్వారా 5,222 మంది రైతులకు రూ.4.38 కోట్ల లబ్ధి
- నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా 7,216 మందికి రూ.129.89 కోట్లు జమ
- ఇండస్ట్రియల్ శాఖ ద్వారా 53 మందికి రూ.2.93 కోట్ల లబ్ధి
- మెడికల్ అండ్ హెల్త్ శాఖ ద్వారా 8829 మందికి రూ.3.16 కోట్లు జమ
- మెప్మా పథకం ద్వారా 2,06,33 మంది అక్క చెల్లెమ్మలకు రూ.107.08 కోట్ల లబ్ధి
- మైనార్టీ వెల్ఫేర్ ద్వారా 248 మందికి రూ.5.15 కోట్లు జమ
- రెవెన్యూ శాఖ ద్వారా 14,677 మందికి రూ.187.04 కోట్ల లబ్ధి
- ఎస్టీ కార్పొరేషన్ పథకం ద్వారా 47 మందికి 0.5 కోట్లు జమ
- సెరికల్చర్ ద్వారా 287 మందికి రూ.2.24 కోట్ల లబ్ధి
- సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 24937 మంది విద్యార్థులకు రూ.68.95 కోట్లు జమ
- రవాణా శాఖ ద్వారా వాహనమిత్ర పథకం ద్వారా 282 మందికి రూ.0.88 కోట్ల లబ్ధి
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద 22,308 మంది కి రూ.50.05 కోట్లు జమ

అభివృద్ధి పనులకు చేసిన ఖర్చు పరిశీలిస్తే...

- ఏపీఈడబ్ల్యుఐడీసీ ద్వారా వివిధ సంక్షేమ వసతి గృహాల్లో నిర్మాణాల కోసం 193 పనులకు రూ.6.97 కోట్లు
- కోవిడ్, నాబార్డు పథకాలతో 2 పనులకు రూ.2.60 కోట్లు
- ఏపీఎస్పీడీసీఎల్ ద్వారా 148 పనులకు రూ.188.32 కోట్లు
- ఏపీ ట్రాన్స్‌కో ద్వారా రెండు పనులకు రూ.47.19 కోట్లు
- ఉపాధి పథకంలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో 33 పనులకు రూ.66.41 కోట్లు
- సీఎండీఎఫ్, జీజీఎంపీ, ఎంపీలాడ్స్ నిధులతో 471 పనులకు 1.36 కోట్లు
- పబ్లిక్ హెల్త్ ద్వారా ఏఐఐబీ పథకం కింద రెండు పనులకు రూ.2.68 కోట్లు
- ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా 38 పనులకు రూ.13.75 కోట్లు
- ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 281 పనులకు రూ.1.15 కోట్లు
- పాఠశాల విద్య ద్వారా 513 పనులకు రూ.54.19 కోట్లు
- మైనర్ ఇరిగేషన్ ద్వారా 9 పనులకు రూ.1.22 కోట్లు
- సెర్ప్ నిధులతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భవనాలు, ఇతర నిర్మాణాలకు 1051 పనులకు ఏకంగా రూ.94.79 కోట్లు ఖర్చు చేశారు.

కృష్ణమ్మ గుట్ట వద్ద ఉద్రిక్తత

కుందుర్పి: కృష్ణమ్మ గుట్ట వద్ద గురువారం మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకోంది. స్థానిక రెవెన్యూ కార్యాలయం సమీపంలో ఉన్న కృష్ణమ్మ గుట్ట వద్ద ఉన్న పదిసెంట్ల స్థలం కోసం అటు దివ్యాంగులు, ఇటు సావిత్రమ్మ అనే మహిళ ఆరేళ్లుగా వివిధ రూపాల్లో ఆందోళనలు, కోర్టుకు వెళ్లి నానాతంటాలు పడుతున్నారు. వారం రోజులుగా దివ్యాంగులు తహసీల్దార్ కార్యాలయం వద్ద తమకు పట్టాచ్చారని, 10 సెంట్ల స్థలం చూపాలని ఆందోళన చేపట్టి బుధవారం విరమించారు. అలాగే కురుబ సావిత్రమ్మ 2010లో తమకు కృష్ణమ్మ గుట్ట వద్ద ప్రదాన రహదారికి ఆనుకుని ఐదు సెంట్ల స్థలానికి పట్టా ఇచ్చారని, వారం కిందట కోర్టు స్టేటస్‌కో ఇచ్చిందని గురువారం ఇటుకలు తీసుకువచ్చి ప్రహరీ నిర్మించేందుకు ప్రయత్నించగా దివ్యాంగులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పోలీసులు ఇరు వర్గాల వారిని అక్కడి నుంచి పంపించారు. కాగా తహసీల్దార్ విజయకుమారి మట్లాడుతూ బుధవారం ఆ స్థలాన్ని ఆర్డీఓ నిశాంత్ రెడ్డి సైతం పరిశీలించారని, గతంలో ఇచ్చిన పొజిషన్లు ఇరు వర్గాలకూ రద్దు చే శామన్నారు. ప్రస్తుతం సర్వేనెంబర్ 226లో ఉన్న 10 సెంట్ల స్థలం ప్రభుత్వ ఆధీనంలో ఉందన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి ఊరేగింపు


ఊరేగింపు ఎదుట కలశాలతో బాలికలు

వజ్రకరూరు: మండలంలోని కమలపాడులో చౌడేశ్వరీ దేవి విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం అమ్మవారి విగ్రహ ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం ఉదయం సుప్రభాత సేవ, వివిధ హోమాలు చేపట్టారు. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సర్పంచు కురుబ తిరకమ్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన రైతు గంపిరెడ్డి కూడేరు సొసైటీ బ్యాంకుల్లో సభ్యత్వం కల్గి ప్రమాద బీమా చేయించుకున్నాడు. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడికి ప్రమాద బీమా పథకం కింద రూ.2 లక్షలు మంజూరైంది. గురువారం సొసైటీ బ్యాంక్‌లో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర రెడ్డి తదితరులు గంపిరెడ్డి భార్య నాగమణికి రూ.2 లక్షల చెక్కును అందజేశారు.ఆయన మాట్లాడుతూ రైతులకు విరివిగా రుణ సదుపాయం కల్పిస్తూ, సక్రమంగా వసూళ్లు చేస్తూ బ్యాంక్‌ను ఆర్థికంగా బలోపేతం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు వడ్డే గంగాధర్, ఎంపీపీ నారాయణ రెడ్డి, సర్పంచ్ ఓబుళమ్మ, వైఎస్సార్ సీపీ నేతలు దేవేంద్ర, బైరెడ్డి రామచంద్రారెడ్డి, ఎర్రనాగప్ప, సిద్ధారెడ్డి, వెంకటేష్, బచ్చలయ్య, రామాంజనేయులు, గురునాథ్‌రెడ్డి, బ్యాంక్ సిబ్బంది శివ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయకండి


ఈఎన్‌సీ కృష్ణారెడ్డితో సమావేశమైన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: నింబగల్లు నుంచి పట్టణానికి అదనపు తాగునీటి పైప్‌లైన్ నిర్మించి ఉరవకొండతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) కృష్ణారెడ్డిని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు. గురువారం విజయవాడలోని ఈఎన్‌సీ కార్యాలయంలో ఆయనతో ఎమ్మెల్సీ భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ జిల్లాలో జేసీ నాగిరెడ్డి తాగునీటి పథకం కింద మంజూరైన సిమెంట్ పైపులు దాదాపు 12 కిలోమీటర్ల మేర రోడ్డు పక్కన పడి ఉన్నాయన్నారు. ఆపైపులను నింబగల్లు నుంచి ఉరవకొండకు అదనపు పైప్‌లైన్ కోసం ఏడు కిలోమీటర్లు వినియోగిస్తే ఉరవకొండకు తాగునీటి ఇబ్బంది ఉండదన్నారు. మిగతా పైపులను కూడా వైటీ చెరువుతోపాటు 17 గ్రామాలకు ఐదు కిలోమీటర్ల మేర వినియోగించి తాగునీరు సరఫరా చేయవచ్చన్నారు. గత ఏడాది వీటికి సంబంధించి సాంకేతిక అనుమతుల కోసం అనంతపురం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఈప్రాజెక్టును త్వరగా ప్రారంభించాలన్నారు. అలాగే జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయి పనులు వెంటనే పూర్తి చేయించేలా ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ కోరారు. నింబగల్లు నుంచి ఉరవకొండకు పైప్‌లైన్ పథకానికి వెంటనే అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ఈఎన్‌సీ హామీ ఇచ్చారు.

దుష్ప్రచారాలను తిప్పికొట్టండి


మాట్లాడుతున్న జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్షపార్టీలు చేస్తున్న దుష్ప్రచారాలను సోషల్ మీడియా వేదికపై తిప్పికొట్టాలని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి సూచించారు. కణేకల్లులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం పార్టీ మండల సోషల్ మీడియా శ్రేణుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి మీరు చేసిన కృషి ఎన్నటికీ మరవలేమన్నారు. 2024 ఎన్నికల్లో సైతం వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలన్నారు. మీకు ఏ అవసరమొచ్చినా మేము అండగా ఉంటామన్నారు. ప్రధాన ప్రతిపక్షం టీడీపీ సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో తప్పుడు సమాచారాన్ని చేరవేస్తూ మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తోందని, దీన్ని ఎప్పటికప్పుడు ఖండిస్తూ తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టి.కేశవ రెడ్డి, గోపులాపురం సర్పంచు ప్రకాష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సర్మస్ హుసేన్సీ దర్గాలో ఫాతేహాలు


స్వామి సమాధిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్సీ స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా దర్గా మతపెద్దలు విశ్వేశ్వరరెడ్డిని శాలువాతో సత్కరించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఉరవకొండ: పట్టణంలోని 11వ వార్డులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు డి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలన్నారు.

11న ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

ఉరవకొండ: మండలంలోని చిన్నముష్టూరు మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి ఈనెల 11న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రశస్తకుమారి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు అరగంట ముందే మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు.

శెట్టూరు: మండలంలోని ఏపీ మోడల్ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్‌టికెట్లు విడుదల చేశామని ప్రిన్సిపాల్ గాయత్రి తెలిపారు. ప్రవేశ పరీక్ష జూన్ 11న ఉంటుందన్నారు. ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఇన్ అనే వెబ్ సైట్ ద్వారా విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశులు సూచించారు. మోడల్ స్కూల్ సెంటర్‌లో ఈ నెల 11న పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్షకు 203 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

రెండో వైస్ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం


ప్రమాణం స్వీకారం చేస్తున్న రాకెట్ల పుష్పావతి

విడపనకల్లు: మండల పరిషత్ రెండో వైస్ ఎంపీపీగా రాకెట్ల పుష్పావతి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండో వైస్ ఎంపీపీ పదవికి ఒక్క నామినేషన్ మాత్రమే రావడంతో వి.కొత్తకోట గ్రామానికి చెందిన తిమ్మరాజు, గడేకల్లు ఎంపీటీసీ 2 ఓబుళేసు రాకెట్ల పుష్పావతిని బలపరిచారు. సభ్యులంతా కూడా వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఆమెతో ఎన్నికల అధికారి షఫ్రీన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎంపీపీ కరణం పుష్పావతి మొదటి వైస్ ఎంపీపీ మోదుపల్లి సునీత రాణి, సచివాలయ కన్వీనర్ భరత్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బసన్న, కరణం భీంరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు ఆమెను శాలువాలు కప్పి పూలమాలతో సత్కరించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సత్యబాబు, పంచాయతీ కార్యదర్శులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గానికి చెందిన వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూర్ నారాయణస్వామి ఆమెను సత్కరించి శుభాకంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో వాయిదా

రాయదుర్గం రూరల్: ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో గురువారం జరగాల్సిన వైస్ ఎంపీపీ- 1 ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేసినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి రవిశంకర్ రెడ్డి తెలిపారు. మొత్తం 12 ఎంపీటీసీ స్థానాలకు గానూ వైస్ ఎంపీపీ-1గా ఉన్న కెంచానపల్లి ఎంపీటీసీ సత్యనారాయణ నాయుడు గత నవంబర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ ఎన్నిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మిగిలిన 11 మంది ఎంపీటీసీ సభ్యులలో ఒకరు కూడా హాజరు కాకపోవడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండయ్య, ఏఓ చిక్కణ్ణ, సీనియర్ అసిస్టెంట్ రవి, సతీష్, చంద్ర, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధి

వజ్రకరూరు:అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎంపీడీఓ విజయలలిత అన్నారు. గురువారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, సర్పంచులు జయేంద్రరెడ్డి, మోనాలిసా, ఉమామహేశ్వరి, కవితాభాయి, నాయకులు సామానాయక్, న ల్లబోతులరాజు తదితరులు ఎంపీడీఓను కలిసి సత్కరించారు. అలాగే వారు ఈఓఆర్డీగా నియమితులయిన సదాశివను సన్మానించారు.

దంపతులపై దాడి

కళ్యాణదుర్గం: శెట్టూరు మండలంలోని చిన్నంపల్లి గ్రామానికి చెందిన గొల్ల సరోజమ్మ, నాగన్న దంపతులు గురువారం కొత్త ఇళ్లు నిర్మించుకునేందుకు కొలతలు వేశారు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన శివప్ప, బడ ఈరన్న, హనుమంతరాయుడుతో పాటు మరో ఐదుగురు తమపై దాడికి దిగారని దంపతులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు శెట్టూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను నియమించండి'

వజ్రకరూరు: వజ్రకరూరు పంచాయతీలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను నియమించాలని వార్డు సభ్యులు మధుసూదన్, మల్లికార్జునరెడ్డి తదితరులు కోరారు. ఈ మేరకు వారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలలితకు వినతిపత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్ భరత్ ఇటీవల రాజీనామా చేయడంతో సమస్య నెలకొందన్నారు. ప్రధానంగా జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలు, బిల్లుల చెల్లింపు, జియో ట్యాగింగ్‌కు విఘాతం కలుగుతోందని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లారు.

26.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

వజ్రకరూరు: మండల కేంద్రంలో బుధవారం రాత్రి కురిసిన వర్షం 26.8 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ గురువారం తెలిపారు. పదును వర్షం కురవడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తంచేస్తూ పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు.

మహా ధర్నాకు తరలిరండి

విడపనకల్లు: ఉరవకొండ గాంధీ హరిజన హాస్టల్ పరిరక్షణ కోసం ఈ నెల 15న ఉరవకొండ తహసీల్దారు కార్యాలయం ఎదుట నిర్వహించే మహా ధర్నాకు మాదిగలంతా తరలిరావాలని హరిజన హాస్టల్ పరిరక్షణ కమిటీ సభ్యులు కెంగూరి ఎర్రిస్వామి, సింగాడీ వీరప్ప, నాగేంద్ర, వెంటేశులు, ఆల్దప్ప కోరారు. ఈ మేరకు వారు గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాధర్నా పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ హరిజన హాస్టల్ కబ్జాకు గురి కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో హరిజన హాస్టల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'నాడు- నేడు' పనులు పూర్తి చేయండి

శెట్టూరు: మండల వ్యాప్తంగా పాఠశాలల్లో 'నాడు-నేడు' పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. గురువారం మండలంలోని బచ్చేహళ్లి, చెర్లోపల్లి, లింగదీర్లపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో నాడు-నేడు పనులను మండల ఇంజినీర్ కాంచనతో కలసి ఎంఈఓ పరిశీలించారు. రెండో విడత పనులకు ఇప్పటికే ప్రభుత్వం రూ.మూడు కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

10 నుంచి రైతు గర్జన ప్రచార యాత్ర

రాయదుర్గంటౌన్: బొమ్మనహాళ్ హెచ్చెల్సీ నుంచి ఈ నెల 10న ప్రారంభించే రైతు గర్జన ప్రచార యాత్రకు సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ హాజరవుతారని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున తెలిపారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బొమ్మనహాళ్, కణేకల్లు, ఉరవకొండ ప్రాంతాల్లో 19వ తేదీ వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు. కర్ణాటక, కేంద్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా కర్ణాటకలో చేపట్టిన అప్పర్, నవలి ప్రాజెక్ట్‌ల ద్వారా రాయలసీమకు సాగు, తాగునీటి కష్టాలు ఎదురవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వైఖరిని ఎండగడుతూ ప్రచారయాత్ర చేపడతామన్నారు. రైతులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘాల నేతలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.